క్లుప్తంగా

కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలకం



సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరిస్తున్న ఎస్పీ

సిరిసిల్లక్రైం: ఏదేని నేరం జరిగినప్పుడు నిందితులను పట్టుకోవడంతో పాటు వారిని నేరస్తులుగా నిరూపించడానికి సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన ఫుటేజీ కీలకపాత్ర వహిస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించి మాట్లాడారు. కెమెరాల ఏర్పాటుకు సహకరించిన ఓలాద్రి సత్యనారాయణరెడ్డి, మల్లేశంగౌడ్, ప్రజాప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఎస్‌ఐ సుధాకర్, సర్పంచ్ జితేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'కు స్పందన



సిరిసిల్లటౌన్: 'ఆరోగ్యమహిళ' కార్యక్రమాన్ని ప్రతివారం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు తెలిపారు. జిల్లా వైద్యారోగ్య శాఖ చేపట్టిన 'ఆరోగ్య మహిళ' శిబిరానికి మంచి స్పందన వస్తుందన్నారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీపీసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యారోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన ఆరోగ్య మహిళా శిబిరాల్లో మొత్తం 577 పరీక్షలు నిర్వహించారు. ఐదుగురిని జిల్లాసుపత్రికి రెఫర్ చేసినట్లు వెల్లడించారు. ఆయా ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కొనసాగుతోంది. ఇటీవల వీర్నపల్లి మండలకేంద్రంలో 300 కుటుంబాల ఆరోగ్య వివరాలు సేకరించారు. మండలకేంద్రంలోనూ గురువారం వరకు 300 కుటుంబాల ఆరోగ్య వివరాలు సేకరించనున్నట్లు సిగ్మా రీసెర్చ్ సంస్థ ప్రతినిధి ఎం.సంతోష్ తెలిపారు. ఈ సర్వేలో సిగ్మా రీసెర్చ్ సంస్థ ప్రతినిధులు నవీన్, క్రితిక, ఆశా కార్యకర్తలు స్రవంతి, లత తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను వేధిస్తే చర్యలు

సిరిసిల్లకల్చరల్: వృద్ధులను వేధించేవారిపై చర్యలు తీసుకుంటామని టౌన్ సీఐ రఘుపతి హామీ ఇచ్చారు. ఆల్ సీనియర్ సిటిజన్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సీఐని ఆయన కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న కన్నవారిని పోషించే బాధ్యత పిల్లలదేనన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చేపూరి బుచ్చయ్య, జనపాల శంకరయ్య, ఇరుకుల్ల భాస్కర్, దొంత దేవదాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి

వేములవాడరూరల్: పదోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి ఘనంగా సన్మానించారు. వేములవాడ పట్టణంలోని 13వ వార్డు కోనాయపల్లెలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి పదోన్నతిపై వెళ్లిన బూర సదానందం, ఎలబాకా అరుణ, బదిలీపై వెళ్లిన నేరెళ్ల బాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బి బన్నాజీ, 13వ వార్డు కౌన్సిలర్ గడ్డమీద లావణ్య శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు బాణాల సదానందం, ఉపాధ్యాయులు ప్రసాద్, లక్ష్మణ్, శ్రీనివాస్, రాంగోపాల్, సుచరిత, అరవింద, గ్రామస్తులు పాల్గొన్నారు.

మూసివేతపై వివరణకు నోటీసులు

సిరిసిల్లక్రైం: ప్రభుత్వ అనుమతితో నిర్వహించే జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో కొన్ని ఈనెల 27న జిల్లా విద్యాశాఖ అధికారికి గానీ, మండల విద్యాధికారికి గానీ సమాచారం ఇవ్వకుండా సెలవు ప్రకటించాయి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఒకరు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా విద్యాధికారి సంబంధిత పాఠశాలల నిర్వాహకులకు నోటీసులు జారీచేశారు. ఆకస్మికంగా ప్రైవేటు పాఠశాలలు మూసివేయడానికి కారణాలు తెలపాలని, రెండ్రోజుల్లో లిఖితపూర్వకంగా జవాబు ఇవ్వాలని నోటీసులో ఉండడంతో సదరు పాఠశాలల యాజమాన్యాలు అయోమయంలో ఉన్నాయి. దీనికి ట్రస్మాబాధ్యులు వివరణ ఇవ్వడానికి సన్నద్ధమవుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- జిల్లా పోలీసులకు క్రికెట్ పోటీలు
- ఆనందంగా పాల్గొన్న సిబ్బంది
- సిరిసిల్ల కళాశాల మైదానంలో క్రీడలు

సిరిసిల్లక్రైం: ఎప్పుడు కంటిమీద కునుకులేకుండా విధులు నిర్వహించే పోలీసులు క్రికెట్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. డివిజన్‌స్థాయి పోలీసు అధికారి నుంచి కానిస్టేబుళ్ల వరకు పోటీల్లో పాల్గొని అందిరినీ ఉత్సాహపరిచారు. ఏడాది క్రితం జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ అఖిల్ మహాజన్ నేతృత్వంలో పోలీసులకు క్రీడాపోటీలు నిర్వహించడం ఇది రెండోసారి. ఒక వేదికగా అందరూ కలవడంతో స్నేహభావం పెంపొందుతుందని, విధి నిర్వహణలో ఒత్తిడి కలుగకుండా ఉత్సాహంతో పనిచేయవచ్చని ఎస్పీ తెలిపారు. జిల్లా వేదికగా జరుగుతున్న 'సిరిసిల్ల పోలీస్ క్రికెట్ ప్రీమియం లీగ్' పోటీల్లో పాల్గొన్న పోలీసు అధికారుల మనోగతం..

పోటీల్లో ఎనిమిది జట్లు

జిల్లా పోలీస్‌శాఖలో రెండు నియోజకవర్గాలు న్నాయి. ఆయా సబ్ డివిజన్ పరిధిలోని ఉద్యోగులతో డీఎస్పీ స్థాయి అధికారి కెప్టెన్‌గా ఉండి జట్టు గెలుపు రథసారథులుగా వ్యవహరిస్తున్నారు. సోమవారం ప్రారంభమైన ఈ క్రికెట్ ప్రీమియం లీగ్‌లో ఎనిమిది జట్లు పోటీపడ్డాయి. వీటిలో ఎంటీ ఈ గల్స్, సిరిసిల్ల స్ట్రైకర్స్, డీజీ బేవ్ సోల్జర్స్, వేములవాడ రుద్రాస్ జట్లు విన్నర్లుగా నిలిచారు. ఈ జట్లు బుధవారం సెమీఫైనల్స్ పోటీల్లో తలపడనున్నాయి.

స్నేహపూర్వక వాతావరణం



క్రీడాపోటీలతో మంచి స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుంది. మానసిక, శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదపడుతాయి. రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వహిస్తాం. జిల్లాలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఉల్లాసం కలిగించింది.

– ఉదయ్‌రెడ్డి, సిరిసిల్ల డీఎస్పీ

ఇలాగే కొనసాగించాలి



ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా అందరి మధ్య సత్సంబంధాలు పెరుగుతాయి. అన్నిస్థాయిల అధికారులు బృందంగా ఏర్పడి పోటీల్లో పాల్గొన్నాం. క్రీడా పోటీల నిర్వహణ ఇలాగే కొనసాగించాలి.

– శశిధర్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేట, సీఐ

డివిజన్ స్థాయిలో క్రీడలు



జిల్లాస్థాయిలో క్రీడాపోటీలు నిర్వహించేందుకు ముందుగా డివిజన్‌లో పోటీలు నిర్వహించాం. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది. పని ఒత్తిడిలో ఉద్యోగులకు ఉల్లాసం కలుగుతుంది. విధుల్లో ఉత్సాహం చూపుతారు.

– నాగేంద్రచారి, వేములవాడ డీఎస్పీ

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుంది. ఒత్తిడిని అధిగమించి ఉత్సాహంగా పనిచేసేందుకు వీలు కలుగుతుంది. అన్నిస్థాయిల ఉద్యోగులు ఒక వేదికగా కలుసుకొని ఇలాంటి క్రీడాపోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది.

– కిరణ్‌కుమార్, చందుర్తి సీఐ

ఒత్తిడినుంచి ఉపశమనం



సెలవురోజుల్లో వేములవాడలో భక్తుల రద్దీ ఉంటుంది. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు క్రీడాపోటీలు దోహదపడుతాయి. పోలీసు ఉన్నతాధికారులు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉంది.

– దిలీప్, వేములవాడ ట్రాఫిక్ ఎస్సై

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బూర వజ్రమ్మ

వేములవాడఅర్బన్: వేములవాడ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బూర వజ్రమ్మ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరై పలు అంశాలపై వివరించారు. అనంతరం సర్పంచ్‌లు మాట్లాడుతూ తమ పదవికాలం ముగుస్తుండటంతో పెడింగ్ బిల్లులు త్వరగా అందించాలన్నారు. మారుపాకలో ప్రారంభించిన పల్లె దవాఖాన ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించలేదని వైస్ ఎంపీపీ రవిచందర్‌రావు హన్మాజిపేట ప్రాథమిక చికిత్స కేంద్రం మెడికల్ ఆఫీసర్ దివ్యపై మండిపడ్డారు. కొడుముంజ సర్పంచ్ రాజుకుమార్ మాట్లాడుతూ తమ గ్రామ సమస్యలపై పలుసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, ఎంపీడీవో శ్రీధర్, సింగిల్‌విండో చైర్మన్లు కృష్ణదేవరావు, బీరెడ్డి సల్మాన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రవిచందర్‌రావు, ఎంపీటీసీలు బసరాజశేఖర్, దేవరాజు, లహరిక, సర్పంచులు వెంకటరమణారావు, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి (సిరిసిల్ల): పెండింగ్ బిల్లులు ఇప్పించాలని మండల సర్పంచులు కోరారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మాలోత్ భూల అధ్యక్షతన నిర్వహించారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రాలేదని, సర్పంచ్ సాగర్ తెలిపారు. ఇంతకుముందు సమావేశంలో తీర్మానించిన పనులు ఇప్పటివరకు అమలు కాలేదని శాంతినగర్ సర్పంచ్ మల్లేశం అన్నారు. మండలం ఏర్పడి ఆరేళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం ఎందుకు జరగడం లేదని సర్పంచ్ దినకర్ ప్రశ్నించారు. ఎంపీపీ మాలోత్ భూల, జెడ్పీటీసీ గుగులోతు కళావతి మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. సర్పంచులకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. తహసీల్దార్ ఉమారాణి, మండల అభివృద్ధి, అధికారి నరేశ్, కుమార్, సెస్ డైరెక్టర్ మల్లేశం, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీటీసీ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్లు అందజేత



దాతలను సన్మానిస్తున్న పాలకవర్గం

కోనరావుపేట: మండలంలోని వట్టిమల్ల ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు తమవంతు సాయం అందించారు. గ్రామానికి చెందిన నూనె నగేశ్‌యాదవ్ సిరిసిల్లలో మార్బుల్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఉన్నత పాఠశాలకు రూ.లక్ష విలువైన నాలుగు కంప్యూటర్లు, రూ.లక్షతో హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ. లక్షతో హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయించాడు. ఇదే గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ విక్కుర్తి ముత్తయ్య–అనసూయ గ్రామంలో 15 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. పాఠశాలకు గడియారం విరాళంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావు, సర్పంచులు కొమ్ము స్వప్న దేవరాజ్, అశోక్ ఉపాధ్యాయులు పులి రాజు, హన్మాండ్లు, మధు, చిరంజీవి, వేణుగోపాల్, శ్రీనివాస్, నందిని, పద్మ, వైస్‌చైర్మన్ ప్రసాద్, ఆర్‌ఎంపీ వైద్యులు లక్ష్మీరాజం, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

- చదువుకున్న పాఠశాలకు రూ.10 లక్షలతో గదుల నిర్మాణం



అదనపు గదుల ప్రారంభోత్సవంలో పూర్వ విద్యార్థులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు చేయూతనందించారు. తాము విద్యనభ్యసించిన బడికి రూ.10 లక్షలతో రెండు అదనపు గదులు నిర్మించి మంగళవారం ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్ తరగతి గదిలోనే నిర్మితమవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కూనబోయిన భాగ్యలక్ష్మి బాలరాజు, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య యాదవ్, హెచ్‌ఎం ప్రేమలత, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గంభీరావుపేట: మండలంలోని ముచ్చర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి అరుణ, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే బడుగుల అభివృద్ధి



మాట్లాడుతున్న అంకని భాను

సిరిసిల్లటౌన్: రాజ్యాధికారంతోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి అని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకని భాను అన్నారు. మంగళవారం సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. బహుజన రాజకీయ శక్తిని పెంపొందించుకునేందుకు కార్యకర్తలు కృషిచేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శులు దొడ్డి సమ్మయ్య, ఎనగందుల వెంకన్న, జిల్లా అధ్యక్షుడు వర్దవెల్లి స్వామిగౌడ్, ఉపాధ్యక్షుడు లింగంపల్లి మధుకర్, గజ్జెల అశోక్, పిట్టల భూమేశ్, రామచంద్ర, మునీందర్, మహిళా విభాగం అధ్యక్షురాలు ద్యాగల లక్ష్మి, చాకలి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి

కోనరావుపేట: గ్రామ పంచాయతీల పాలకవర్గం త్వరలో ముగుస్తున్నందున వెంటనే ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ గీతాసెల్ జిల్లా అధ్యక్షుడు ముష్కం శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సర్పంచులు, వార్డుసభ్యుల పదవికాలం ముగుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రత్యేకాధికారులను నియమించాలని ప్రభుత్వం చూస్తోందని, దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి ఎన్నికలు నిర్వహించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు విగ్రహావిష్కరణ

బోయినపల్లి: మండలంలోని మర్లపేటలో బుధవారం మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆవిష్కరిస్తారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి మంగళవారం తెలిపారు. మాన్వాడ గ్రామపంచాయతీ భవనం ప్రారంభంతో పాటు, కొదురుపాకలో దోబీఘాట్, హమాలీ, గౌడసంఘం కమ్యూనిటీ హాల్స్, జీపీ దుకాణాల సముదాయాలకు భూమిపూజ చేయనున్నట్లు పేర్కొన్నారు.

హైమాస్ లైట్లు ప్రారంభం

గంభీరావుపేట: మండలంలోని భీముని మల్లారెడ్డిపేటలో జీపీ నిధులతో రెండు ప్రధాన కూడళ్లలో సర్పంచ్ శెట్టి మహేశ్వరి చేతుల మీదుగా హైమాస్ లైట్లను ప్రారంభించారు. బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు హన్మండ్లు, అంజిరెడ్డి, మహేశ్, అజయ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు

వేములవాడఅర్బన్: వేములవాడ మండల పశువైద్యాధికారి కార్యాలయంలో మంగళవారం పెంపుడు కుక్కలకు ఉచిత రేబీస్ వ్యాధి నిరోధక టీకాలను వేసినట్లు మండల పశువైద్యాధికారి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. జిల్లా పశువైద్యాధికారి కొమురయ్య హాజరైనట్లు తెలిపారు.

కుష్టువ్యాధి నివారణపై అవగాహన

గంభీరావుపేట: మండలకేంద్రంలో కుష్టువ్యాధి నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని సర్పంచ్ శ్రీధర్ పంతులు అధ్యక్షతన నిర్వహించారు. కుష్టు వ్యాధి నివారణకు వైద్య సిబ్బంది, పంచాయతీ కార్మికులతో ప్రతిజ్ఞ చేశారు.

నివాళి

బోయినపల్లి: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్వాతంత్ర్య ఉద్యమంలో అమరులైన మహనీయులకు మంగళవారం నివాళి అర్పించారు. ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, ఎంపీవో ఏ.గంగాతిలక్, కార్యాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లికి చెందిన నగరపు ప్రశాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స కోసం ఇబ్బందిపడుతున్నాడు. నాంపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5వేలు ఆర్థికసాయంగా అందజేశారు.

అధికారులు లేని సభ ఎందుకు ?

కోనరావుపేట: ఎగ్లాస్‌పూర్‌లో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవాన్ని గ్రామస్తులు బహిష్కరించారు. అన్నిశాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా ఆర్‌ఐ రజిని మాత్రమే హాజరుకావడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పాలని గ్రామస్తులు ప్రశ్నించారు. అన్నిశాఖల అధికారులు వస్తేనే కార్యక్రమం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చందుర్తి(వేములవాడ): జోగాపూర్‌కు చెందిన సుతారి లచ్చిరెడ్డి (62) ఈనెల 23న గాయపడగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఎస్సై వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మూడపల్లి గ్రామానికి చెందిన శేఖర్ సనుగులలోని తన బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా జోగాపూర్‌లోని శివాజీ విగ్రహం వద్ద ఈనెల 23న లచ్చిరెడ్డి బైక్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన లచ్చిరెడ్డిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

విలీన గ్రామాల అభివృద్ధికి సహకరించండి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పూలమొక్క అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కళ

సిరిసిల్ల: పట్టణ శివారులోని విలీన గ్రామాల అభివృద్ధికి సహకరించాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందించారు. మంత్రి హోదాలో తొలిసారి జిల్లాకు వచ్చిన ఆయనకు కలెక్టరేట్‌లో పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. గత ప్రభుత్వం హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ విలీన గ్రామాల అభివృద్ధికి రూ.40 కోట్లు మంజూరు చేశారని, ఆ నిధులతో పనులు టెండర్లు పూర్తయ్యాయన్నారు. పనులు నిలిపివేయాలని ఆదేశాలు వచ్చాయని, వెంటనే ఆ నిధులతో పనులు చేపట్టే విధంగా చూడాలని ఇవ్వాలని చైర్‌పర్సన్ కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ నాయకులు కె.కె.మహేందర్‌రెడ్డి ఉన్నారు.

మంత్రిని కలిసిన ఎన్జీవోలు

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను టీఎన్‌జీవో ప్రతినిధులు కలెక్టరేట్‌లో కలిసి పూలమొక్క అందించారు. జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి గాజుల సుదర్శన్, ఉపాధ్యక్షుడు మెట్ట శ్రీకాంత్, కోశాధికారి రియాజ్ పాషా, కార్యవర్గ సభ్యులు ఎడ్ల శివసాయి, శ్రీకాంత్, మహిళా అధ్యక్షురాలు ఇస్లావత్ రాజేశ్వరి పాల్గొన్నారు.

ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: జాతర ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లిలో వచ్చేనెల 8, 9వ తేదీల్లో జరిగే దుబ్బ రాజరాజేశ్వర స్వామి ఉత్సవాల పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. మాఘ అమావాస్య జాతర మహోత్సవం 8న పోచమ్మ బోనాలు, 9న శివ కల్యాణం, రథోత్సవం జరుగుతుందని ఉత్సవ కమిటీ ప్రకటించింది. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సూర మల్లయ్య, రాజమల్లయ్య, మొగ్గయ్య, మల్లయ్య, నాగయ్య, బాలయ్య, కొమురయ్య, మల్లారెడ్డి, మధుకర్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సిరిసిల్లటౌన్: తెలంగాణ బంజారా ఎంప్లాయీస్ సేవాసంఘం (టీబీఈఎస్ఎస్) ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు లకావత్ మోతీలాల్, అజ్మీరా భిక్కునాయక్, కోశాధికారి ఇస్లావత్ దేవ్‌సింగ్, లకావత్ పరుశురాం, మోహన్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు విధుల్లోకి తీసుకోవాలి..

వేమలవాడ దేవస్థానంలో పనిచేస్తున్న సురక్ష సెక్యూరిటీ సర్వీసెస్ పారిశుద్య కార్మికుల తొలగింపులో అధికారుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. తమకు న్యాయం చేయాలని కార్మికులు లక్ష్మి, బాబాయ్, మల్లవ్వ, అనిత తదితరులు కోరారు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలోని దేశాయి బీడీ కంపెనీ కార్మికులను యాజమాన్యం వేధింపుల నుంచి కాపాడి, వారికి న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం కార్మికశక్తి బీడీ కార్మిక సంఘం నాయకులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు విన్నవించారు. కంపెనీలోని కార్మికులు రాజీనామా చేసిన సమయంలో సమాచారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. యాజమాన్యం తయారు చేస్తున్న తినుబండారాలను టేకేదార్ల ద్వారా కార్మికులకు నెలకు రూ.200 వరకు అంటగడుతూ ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు కార్మికసంఘం నాయకులు వి.మల్లేశం, వి.లక్ష్మణ్‌రావు, వి.మారుతి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశయ సాధనకు కృషిచేయాలి



గంభీరావుపేట: చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: యువత మహాత్మాగాంధీ ఆశయ సాధనకు చేయాలని ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు బొమ్మకంటి రవీందర్‌గుప్తా కోరారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా మండలకేంద్రంలోని విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు బొమ్మకంటి రాజయ్య, గంప నాగేంద్ర, బొమ్మకంటి రాజేశం, లక్ష్మీనారాయణ, ఎల్లారెడ్డిపేట పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నేవూరి రవీందర్‌రెడ్డి, మున్నూరుకాపు సంఘం మండలాధ్యక్షుడు నంది కిషన్, రెడ్డి సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

గంభీరావుపేట: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. విజయలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ దాసు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పాక ధర్మపురి, అధ్యాపకులు శ్రీవల్లి, వాణి, శ్రావణ్‌కుమార్, ఆది విష్ణు, భిక్షమయ్య, శ్రీనివాస్, మనోహర్, కృష్ణప్రసాద్, విజయ్, మహేష్, రాజేష్, శిరీష, శైలజ, రజిత, శ్రావణి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తిలో..

చందుర్తి : చందుర్తిలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గొట్టే మనోహర్, గ్రామశాఖ అధ్యక్షుడు దారం చంద్రం ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు పులి సత్తయ్య, లింగంపల్లి అజయ్, దెబ్బటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులకు సన్మానం



వేములవాడలో సర్పంచులను సన్మానిస్తున్న అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బూర వజ్రమ్మ ఆధ్వర్యంలో మండల సర్పంచులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ చైర్మన్ హరిచరణ్‌రావు, ఎంపీడీవో శ్రీధర్, ఎంపీటీసీలు రవిచందర్‌రావు, రాజశేఖర్, దేవరాజు, లహరిక, సర్పంచులు వెంకటరమణారావు, రాంరెడ్డి, రాజు, రాజేశం,లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: పదవీకాలం ముగియనుండటంతోమండలంలోని దమ్మన్నపేట పంచాయతీ పాలకవర్గ సభ్యులకు అధికారులు, గ్రామస్తులు మంగళవారం ఆత్మీయంగా సన్మానించారు. సర్పంచ్ సిరిగిరి లక్ష్మీ, ఉపసర్పంచ్ అరుట్ల అంజిరెడ్డి, వార్డు సభ్యులను శాలువాలతో సత్కరించారు.



ముస్తాబాద్: మహిళా ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న గోపాల్‌రావు

ముస్తాబాద్: మోహినికుంట పంచాయతీ ప్రజాప్రతినిధులను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కల్వకుంట్ల గోపాల్‌రావు మంగళవారం ఘనంగా సన్మానించారు. పదవికాలం ముగుస్తున్న సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు 12 మంది వార్డుసభ్యులు ఇక్కడ మహిళలు ఉన్నారని పేర్కొన్నారు. సర్పంచ్ కల్వకుంట్ల వనజ, ఉపసర్పంచ్ సంధ్య, కార్యదర్శి గీత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అ. దికారులు తెలి పారు. తిమ్మాపూర్, గుందారం, బాకూర్‌పల్లిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు అంతరాయం కలుగుతుందన్నారు.